# అఖిలభారత మహిళామహాసభ

## శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

★

ఈ 1941 వ సంవత్సరము డిసెంబరు కడపటివారములో కాకినాడయందు జరుగనున్న అఖిల భారతమహిళాసభ ఆంధ్ర మహిళలకు గొప్ప జాతీయోత్సవమనియే చెప్పవచ్చును. 1923 వ సంవత్సరములో కాకినాడయందే అఖిలభారత జాతీయ మహాసభ (కాంగ్రెసు) జరిగియుండెను. ఎందరో స్త్రీజనము నానా రాష్ట్రములనుండి అమ్మహాసభకు హాజరైయుండిరి. ఎంతయో మహోత్సవము మహావైభవోపేతముగ సాగియుండెను. కాని అది అంతయు నొకయెత్తు, నేటి మహిళాసభ యొకయెత్తు. ఏ మహాసభ జాతి మత కుల వివక్షతరహితయై భారతనారీలోకమునెల్ల నొక్క సూత్రమున నిబద్ధించి, ఒక్క కేంద్రమున సమీకరించి భారతమహిళాభ్యుదయమనెడి యొకేయొక కార్యమునకు సన్ముఖులను గావింప బాధ్యతవహించి పనిచేయుచున్నదో, ఏ మహాసభ భారతనారీమణుల ఏకగ్రీవాభిప్రాయమును ముక్తకంఠముతో జాటుటకు శక్తిని సామర్థ్యమును గలిగియున్నదో, ఏ మహాసభ దొరతనమువారి దృష్టికిని ప్రజల లక్ష్యమునకును స్త్రీల మన్ననకును పాత్రమైయున్నదో, ఏ మహాసభ అంతర్జాతీయ మహిళాలోకముతోగూడ పొత్తుగలిపి యావత్ప్రపంచ స్త్రీలోకమునందున్న భారతమహిళలకు గణనీయస్థానమును సంపాదింప గల్గినదో, ఏ మహాసభ భారతవర్షమునందలి విద్యాధికలు, సేవాధురీణలు, బుద్ధివైశద్యవిశారదలు, ఉన్నతోన్నతాధికార సంపన్నలు, రాజకీయ పరిజ్ఞానలు, జమీందారిణులు, రాజ్ఞులు, మహారాజ్ఞులు నాదిగాగల సమస్త భారతనారీ సముదయమును నొక్కచో జేర్చి స్వీయమహిళాలోకోద్ధరణకార్య నిమగ్నలనుగా జేయుచున్నదో, ఆ అఖిలభారత మహిళా మహాసభ భారత స్త్రీజనముల యోగక్షేమముల విచారించుటకై, మనోగతాభిప్రాయముల విచారించుటకై, కర్తవ్యమును సూచించుటకై, ఐకమత్యమును సమకూర్చుటకై, కాకినాడ నగరమున సమావేశము కాబోవుచున్నది.

అప్పుడే దేశము నలుమూలల తాలూకా జిల్లా రాష్ట్రీయ మహిళాసభలు జరుగుచున్నవి. వందల కొలది వేలకొలది స్త్రీలు సమావేశమగుచున్నారు. స్త్రీవిద్యావిధానములో స్త్రీ జనానుకూలములగు మార్పులు కావలెననియు, స్త్రీలకు ప్రత్యేక కళాశాలలు పారిశ్రామికపాఠశాలలు కావలెననియు, రాజకీయములలో సంపూర్ణమగు ప్రాతినిధ్య మొసంగవలెననియు, ఉభయవంశముల (పుట్టిన మెట్టిన యిండ్ల)లో గూడ వారసత్వములు కావలెననియు, వివాహవయస్సు హెచ్చింపబడవలెననియు, కట్నముల దురాచారము నిర్మూలింపబడవలెననియు, దాయాదుల అనుమతిలేని స్వతంత్రమగు దత్తతాధికారము స్త్రీకి ఒసంగబడవలెననియు, రిజిష్టరైన మహిళాసంఘములకు స్త్రీ వోటరులను జేర్చు అధికార మొసంగబడవలెననియు, తీర్మానములు చేయుచున్నారు. ఇవియేగాక స్థానికముగా ఆసుపత్రులలో, విద్యాలయములలో, రైల్వేస్టేషనులలో, రైళ్లలో, స్థానిక సంఘములలో, స్త్రీలకు గలుగుచున్న అసౌకర్యములను గూర్చియు దీర్ఘములగు చర్చలుచేసి తీర్మానములు గావించుచున్నారు. నదీనదములన్నియు అపారపారావారమున సంగమించినట్లు పరశ్శతములగు నీ తీర్మానములన్నియు అఖిలభారత మహిళాసభ దెసకు ఉరుకులుపెట్టుచు బోవుచున్నవి.

మహా సంపన్నుడును మహాత్యాగియునగు మోతీలాల్ పండితుని గారాబుతనయ, దేశమునకై తన సర్వస్వమర్పించి భారతీయ ప్రజాహృదయమును చూరగొని హిందూస్థానమునకు మకుటములేని రాజను విఖ్యాతివహించిన జవాహర్‌లాల్ నెహ్రూ పండితుని అనుంగుచెల్లెలు, రంజిత పండితుని ప్రేమంపుటిల్లాలు, కాంగ్రెసు ప్రభుత్వములో సంయుక్తరాష్ట్రమునందు స్థానికశాఖామాత్యపదవిని చేపట్టి పాలనావిధానము గుర్తెరిగిన అనుభవజ్ఞురాలు, కాంగ్రెసు పరిపాలన యనిన పరిపాలన చెఱసాలయనిన చెఱసాల స్వీకరింప సంసిద్ధయగు క్రమశిక్షకురాలు, ఎందున్నను ఏ స్థితిలోనున్నను స్వీయనారీలోక సముద్ధరణను నేమరని స్వజాత్యభిమాన, యగు శ్రీమతి విజయలక్ష్మి పండితసతి ఆధిపత్యమున సరోజినీనాయుడు, కమలాదేవి ఛటోపాధ్యాయ, లీలావతీ మున్షి, రాజకుమారి అమృతకౌర్, ముత్తులక్ష్మిరెడ్డి, ఆచంట రుక్మిణమ్మ, అమ్ము స్వామినాధన్, షానవాజు బేగమ్, కజిన్సు సతి, ఆదిగాగల నారీరత్నములుగల నిండు పేరోలగంబున నీ స్త్రీసమస్యలన్నియు చర్చితములై తీర్మానింపబడనున్నవి.

భారతమహిళల భవిష్యత్తు అఖిలభారత మహిళాసభమీదనే ఆధారపడియున్నది. ఈ సభ ఎప్పుడు బలీయమై పల్లె పట్టణముల వ్యాపించి భారతమహిళా హృదయము నాకర్షించి ముక్తకంఠముతో భారత మహిళాభిప్రాయమును వ్యక్తీకరింప నేర్చునో, ఆనాడు భారతమహిళల నోములు పండును. అక్కరలు తీరును. లోపములు తొలగును. వివాదములు పరిష్కృతములగును.

వర్తమానకాలమున వ్యక్తిగత వ్యవహారములకు విలువలేదు. సంఘశక్తియే శక్తి. సంఘము బలీయమైనప్పుడే ప్రపంచదృష్టి నాకర్షించును. కార్యము సానుకూలమగును. భారత నారీమణులు అభ్యున్నతి నొందనెంచుచో నిట్టి సంఘబలమునే చేకూర్చుకొనవలయును. అట్టి సంఘీభావము చేకూరుట కిట్టి మహిళా సమావేశములే సాధనములు.

అఖిలభారత మహిళాసభ లిప్పటికి పదునాలు జరిగినవి. కాని అవి అన్నియు కలకత్తా, బొంబాయి, ఢిల్లీ, అలహాబాదు, తిరువనంతపురము, మద్రాసు, మైసూరు మున్నగు మహానగరములందే జరిగినవి. కాన ఆంధ్రస్త్రీల కందుబాటు కాలేదు.

నేడు, ఏ నగరమునందు కాంగ్రెసు జరిగి దేశవిఖ్యాతిని సంపాదించెనో ఆ కాకినాడ నగరమున, తెలుగుసీమ నడిబొడ్డున, అఖిలభారత మహిళామహాసభ సమావేశము కానున్నది. కాన యావదాంధ్ర మహిళాలోక మీ కార్యకలాపమున బాధ్యత కలుగజేసికొని భారతదేశమునందలి పలుసీమలనుండి యేతెంచెడి నారీరత్నములను సగౌరవముగ సన్మానించి ఆంధ్రనారీమణుల అతిథిసత్కార కౌశలమును జగద్విదితము కావింపవలెను.

ఆంధ్రనారీమణులెల్లరు ఈ మహిళాసభయొక్క ఆహ్వానసంఘములో సభ్యురాండ్రుగా జేరి తీర్థయాత్రకు వెడలినట్లు లీ మహిళోత్సవమును దర్శింపనేగి ధన్యాత్మలు కావలెను.

కాకినాడ నగరలక్ష్మి నానాదేశాగత నారీలోకముచే కలకలలాడవలెను. భగవాను డనుగ్రహించును గాక!

---